వైఎస్సార్ సీపీ హయాంలో అభివృద్ధి పరుగులు

- వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వెంకటేష్

చీరాల టౌన్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి చీరాలలో అభివృద్ధి పరుగులు పెట్టించారని నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. శనివారం మండలంలోని ఈపూరుపాలెం నుంచి బైపాస్, వేటపాలెం నుంచి పందిళ్లపల్లి వరకు నూతన రోడ్డు నిర్మాణం చేపట్టిన అభివృద్ధి పనులను పార్టీ నాయకులతో కలిసి వెంకటేష్ పరిశీలించారు. మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ప్రత్యేక చొరవతో ఎన్‌హెచ్, ఆర్అండ్‌బీ ద్వారా ఈఏడాది జనవరిలో రూ.24. 23 కోట్లతో నిర్మాణం చేపట్టిన ప్రజలకు వినియోగంలోకి వచ్చిన రోడ్లను పరిశీలించారు. ఈసందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. 2019 నుంచి 2024 ఏప్రిల్ వరకు చీరాల నియోజకవర్గంలోని చీరాల మున్సిపాలిటీ, చీరాల రూరల్, వేటపాలెం మండలాల్లోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశామన్నారు. పరిపాలన అనుభవం కలిగిన తన తండ్రి బలరాం ప్రత్యేక చొరవతో పాటుగా మాజీ సీఎం జగనన్న చీరాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిధులు విడుదల చేసి అభివద్ధికి పాటుపడ్డారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కౌన్సిలర్లు వెంకటరావు, ప్రభాకరరావు, నాయకులు గవిని శ్రీనివాసరావు, పి.నాగేశ్వరరావు, జయరావు, సుబ్బారావు, బిట్రా శ్రీను. సువార్త, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థుల సేవ అభినందనీయం


మొక్క నాటుతున్న సీనియర్ సివిల్ జడ్జి సుధ

చీరాల రూరల్: ఎన్‌సీసీ విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి సేవా కార్యక్రమాలు చేపట్టడం ఎంతో అభినందనీయమని సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ అన్నారు. ఎన్‌సీసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం 23 (ఏ) ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ అధికారి కల్నల్ సునీల్ గౌతమ్ ఆదేశాల మేరకు సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడి యం స్కూలు ఎన్‌సీసీ విద్యార్థులు, ప్రైడ్ ఇటర్నేషనల్ స్కూలు ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ప్రైడ్ ఇంటర్నేషనల్ స్కూలు విద్యార్థులు చీరాల కోర్టు ప్రాంగణంలో స్వచ్ఛ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. న్యాయమూర్తులు ఎం. సుధ, షేక్ నిషాద్‌నాజ్ చేతుల మీదుగా మొక్కలు నాటించారు. విద్యార్థులకు అవసరమైన చట్టాలను గురించి న్యాయమూర్తులు వివరించారు. అనంతరం సెయింట్ ఆన్స్ స్కూలు విద్యార్థులు కోటయ్య అనాథాశ్రమంలోని వృద్ధులు, చిన్నారులకు 100 మందికి ర గ్గులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సిస్టర్ ఎల్లా ట్రిసా, ప్రిన్సిపాల్ సిస్టర్ జీనా జేవియర్, ఎన్‌సీసీ సుబేదార్ రేఖారామ్, ఎన్‌సీసీ ఇన్‌స్ట్రక్టర్ గొర్ల గోపినాథ్, జీహెచ్ఎం రమేష్, పీఈటీ బోయిన ధనుంజయ పాల్గొన్నారు.

దాతల సాయం మరువలేనిది


కంప్యూటర్లను అందజేస్తున్న దాత శ్రీనివాస్

యద్దనపూడి: తమకు అక్షర భిక్ష పెట్టి తమ ఉన్నతికి బాటలు వేసిన పాఠశాల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సాయం మరువలేనిదని హెచ్ఎం రాఘవ రెడ్డి కొనియాడారు. శనివారం మండలంలోని అనంతవరం గ్రామంలోని కొల్లా వీరవసంతరావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన పాఠశాల పూర్వ విద్యార్థి కెనరా బ్యాంకు చెన్నై సర్కిల్ ఆఫీస్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పెడవల్లి శ్రీనివాస్ రూ.1.5 లక్షల విలువైన కంప్యూటర్లను, కుర్చీలు, ఫ్యాన్లు, కలర్‌ప్రింటర్‌ను పాఠశాలకు అందజేశారు. ఈసందర్భంగా తమకు విద్యాబోధన చేసిన అనాటి ఉపాధ్యాయుడు గుర్రం గోవిందరాజును పూర్వవిద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు తుర్లపాటి శ్రీనివాస్, కార్యదర్శి శ్రీనివాసరావు, షేక్ శ్రీనివాస రావు, జీ పాండురంగారావు, పెడవల్లి రమేష్, కొల్లా రమణ, ఎమ్. నరేంద్ర పాల్గొన్నారు.

మండలాల అభివృద్ధికి కృషిచేయాలి

అద్దంకి రూరల్: మండలాల అభివృద్ధికి ఎంపీడీవోలు కృషిచేయాలని జిల్లా ప్రజాపరిషత్ సీఈవో బీ. చిరంజీవి పేర్కొన్నారు. శనివారం అద్దంకి ఎంపీడీవో కార్యాలయానికి విచ్చేశారు. ఈసందర్భంగా ఐదు మండలాల ఎంపీడీవోలతో ఆయా మండలాల అభివృద్ధి పనులపై సమీక్షించారు. కార్యక్రమంలో అద్దంకి ఎంపీడీవో శింగయ్య, నాలుగు మండలాల ఎంపీడీవోలు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

అద్దంకి రూరల్: మండలంలోని శింగరకొండపాలెం గ్రామంలో అక్రమంగా మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న గ్రామానికి చెందిన ఏర్రిబోయిన శ్రీనివాసరావును అదుపులోకి ఎక్సైజ్ సీఐ భవాని శనివారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి 8 క్వార్టర్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఎక్కడైన మద్యం అమ్మితే చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

వేటపాలెం: మండల పరిధిలో పందిళ్లపల్లి పీఏసీఎస్ ద్వారా రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తహశీల్దార్ పార్వతి తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రైస్ మిల్లర్లుకు, వ్యవసాయ సిబ్బందికి, వీఆర్‌ఓలకు ధాన్యం కొనుగోలుపై శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి ఐ కాశీవిశ్వనాథ్ మాట్లాడుతూ ఈ ఏడాది మండలం పరిధిలోని ధాన్యం పండించే రైతుల వద్ద నుంచి ప్రభుత్వం ద్వారా 10 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడానికి అనుమతులు వచ్చిందని తెలిపారు. రైతులు పండించిన ధాన్యం నేరుగా పీఏసీఎస్ ద్వారా విక్రయించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్లు, సిబ్బంది. వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయిబాబా జయంతి

వేటపాలెం: స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోగల సత్య సాయి మందరంలో సత్య సాయిబాబా 99వ జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ నిర్వహించారు. మందిరంలో గల సత్య సాయిబాబా స్పృశించిన శివలింగానికి భక్తులు అభిషేకాలు నిర్వహించారు. సత్యసాయి సత్యన్నారాయణ వ్రతాలు నిర్వహించారు. అనంతరం పేదలకు దుప్పట్లు, మహిళలకు జాకెట్‌లు పంపిణీ చేశారు. 230 మందికి మధ్యాహ్నం భక్తులకు అన్నదానం వితరణ చేశారు. జిల్లా సేవాదళ్ కో ఆర్డినేటర్ ముంగర రాంబాబు స్వామి దివ్యత్వం గురించి తెలిపారు. సంస్థ ద్వారా జరుగుతున్న వివిధ ఆధ్యాత్మిక విద్య, వైద్య, సేవా కార్యక్రమాలు గురించి వివరించారు. కార్యక్రమంలో వేటపాలెం సత్యసాయి సేవా సమితి కన్వీనర్ నరసింహారావు, వీ సుధాకర్, పీ సుబ్బారావు, గుత్తి హేరంబేశ్వరరావు, గంటా శివప్రసాద్, సేవా సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందనలు

చీరాల అర్బన్: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో జిల్లా స్థాయిలో నిర్వహించిన వివిధ పోటీలలో చీరాల ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ జె.సరళ శనివారం తెలిపారు. జిల్లా స్థాయిలో జరిగిన చర్చ కార్యక్రమంలో ఏ.అభిషేక్, ఆర్.రోహిత్‌బాబు ప్రథమ స్థానం, పాటల పోటీల్లో కె.మనస్విని ప్రథమస్థానంలో నిలిచిందని చెప్పారు. క్విజ్ పోటీలో పీవీఎస్ఎస్ సంతోష్ ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ఈనెల 25న జోనల్ స్థాయిలో జరిగే పోటీల్లో జిల్లా తరుపున పాల్గొంటున్నారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ జి.శామ్యూల్ జాన్, స్కూల్ కో-ఆర్డినేటర్ ప్రూడెన్స్, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు

చీరాల టౌన్: 1 జనవరికి 18 ఏళ్లు నిండుతున్న ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని తహశీల్దార్ కె.గోపీకృష్ణ సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శనివారం మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో బీఎల్వోలు, వీఆర్వోలు ఓటు నమోదు కార్యక్రమాన్ని చేపట్టి అర్హులైన వారి నుంచి అర్జీలు స్వీకరించారు. మండలంలోని దేవాంగపురి, రామకృష్ణాపురం, సాల్మన్‌సెంటర్ గ్రామ పంచాయతీల్లోని పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహశీల్దార్ పరిశీలించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఫోరం కృషి


విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్న అధికారులు

చీరాల అర్బన్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కన్స్యూమర్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ ఫోరం ఎంతో ఉపయోగపడుతుందని ఫోరం చైర్మన్ ఎస్.విక్టర్ ఇమ్మానియేలు అన్నారు. కన్స్యూమర్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ ఫోరం విజయవాడ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కొత్తపేటలోని రావి జయలక్ష్మి సుబ్బారాయుడు కల్యాణ మండపంలో విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో చీరాల డివిజన్ పరిధిలో మొత్తం 11 మంది విద్యుత్ వినియోగదారులు తమ ఫిర్యాదులను రాతపూర్వకంగా అందించారు. కార్యక్రమంలో ఎస్ఈ ఆంజనేయులు, ఈఈ కె.జాన్‌థామస్, ఏఈఈ బి.హరిప్రసాదరావు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

కుమారుడు కనబడటం లేదంటూ ఫిర్యాదు


అనురాజ్‌కుమార్

మేదరమెట్ల: తల్లిదండ్రులు తిట్టారని కొడుకు ఇంటి నుంచి వెళ్లిపోయాడన్న ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. కొరిశపాడు మండలం తిమ్మనపాలెం గ్రామానికి చెందిన అవదేష్‌సింగ్ కుమారుడు అనురాజ్‌కుమార్ (12) తల్లిదండ్రులు తిట్టారని ఈనెల 19వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఎంత వెతికినా కనిపించకపోవడంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమాచారం తెలిసినవారు సీఐ 91211 02140, ఎస్ఐ అబ్దుల్ రఫీ 91211 02169 నంబర్లకు తెలపాలని పోలీసులు కోరారు.

రౌడీ షీటర్లు ప్రవర్తన మార్చుకోకపోతే చర్యలు

కారంచేడు: పోలీస్టేషన్‌లో రౌడీ షీటర్‌గా ఉన్న ప్రతి ఒక్కరూ మీ వ్యక్తిగత ప్రవర్తనను మార్చుకొని నేరాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ వీ వెంకట్రావు అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రం కారంచేడు పోలీస్ స్టేషన్‌లో మండల పరిధిలో ఉన్న రౌడీ షీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ నేర ప్రవృత్తిని బట్టి మీపై ఉన్న రౌడీషీట్ తొలగిస్తామన్నారు. అలా కాకుండా మీ ఆలోచనల్లో తేడా లేకుండా ఇంకా నేరాలపై మీ దృష్టి ఉంటే కఠిన చర్యలకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రైతాంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటం

మార్టూరు: రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటం అవసరమని రైతు సంఘం నాయకులు కోరారు. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు ఈనెల 15వ తేదీ నుంచి నిర్వహిస్తున్న ప్రచార జాతాలో భాగంగా శనివారం సాయంత్రం మార్టూరులో నాయకులు మాట్లాడారు. ఈనెల 26వ తేదీ జిల్లా కేంద్రం బాపట్ల కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాకు రైతులు విరివిగా హాజరై జయప్రదం చేయాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం అందుకు వంత పాడుతుందన్నారు. పార్టీలకు అతీతంగా రైతాంగ సమస్యలు పరిష్కారం కోసం పోరాడాల్సిన అవసరం రైతులకు ఉందని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు కే రామకోటేశ్వరరావు, బొబ్బేపల్లి సాంబయ్య, రామారావు, బత్తుల హనుమంతరావు, బి సూరిబాబు, వి కృష్ణమూర్తి, వై రాంబాబు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.